# వాన

సామాన్యుడి జీవితంలో కష్టాలకి మల్లే ఆకాశమంతా మబ్బులు కమ్మాయి

రాష్ట్రపతి అధికారానికి మల్లే - ఆకాశంలో వుండీ లేనట్టుగా వున్నాడు.

“రాబోయే ఇరవై నాలుగ్గంటల్లో ఆకాశం మేఘావృత్తమై వుంటుంది. ఉరుములతో కూడిన జల్లులు విస్తృతంగా పడవచ్చు...” - అని అప్పుడే రేడియోలో చెప్తున్నారు.

అయితే అనలివ్వాళ వర్షమే రాదని చాలామంది అనుకున్నారుగాని - అయినా వర్షం వచ్చింది.

రావడమే మంచి జోరుగా వచ్చింది.

డబ్బున్న వాడికి లేనివాడి మీద కోపమొచ్చినట్టుగా, నల్లబజారు వ్యాపారమున్న వాడికి లాభాలొచ్చినట్టుగా, ఎన్నికలముందు రాజకీయ నాయకుడికి బీద ప్రజల మీద దయ వచ్చినట్టుగా, పండగలూ పబ్బాలూ వచ్చినప్పుడల్లా క

గారికి కవిత్వం వచ్చినట్టుగా - వర్షం జోరుగా వచ్చింది, తెల్ల డబ్బుకంటే నల్ల డబ్బే ఎక్కువున్న వాడిలా ఆకాశంలో తెల్ల మబ్బుల కంటే నల్ల మబ్బులే ఎక్కువై పోయాయి.

ఎలక్షన్లో గెలిచిన నాయకుడిలా సూర్యుడసలు కన బడ్డమే మానేశాడు. మబ్బుల వెనక మటుమాయమై పోయాడు.

దేశంలో ప్రజాస్వామ్యానికి మల్లే వుండి కూడా పనికి రాకుండా పోయాడు.

పట్ట పగలే చీకటొచ్చింది.

అయిదు నిమిషాలలో రోడ్డంతా ఖాళీ అయిపోయింది.

ఆ పక్కనా ఈ పక్కనా ఉన్న భవనాల దుకాణాల హోటళ్ళ పంచన చేరి జనం వానలోకి చూస్తూ నిలబడ్డారు.

రాజిగాడు కూడా రిక్షా రోడ్డు పక్కకి లాగి, తనో చిన్న హోటలు వరండాలో చేరి, ఒకమూల నిలబడ్డాడు.

తల దాచుకోడాని కొచ్చిన వాళ్ళతోనూ, లోప ల్నించి బయటికొచ్చి, వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురుచూస్తూ నిలబడ్డ వాళ్ళతోనూ ఆ హోటల్ వరండా అప్పటికే నిండి పోయింది.

ఆ సమయాన అక్కడ చేరిన వాళ్ళలో పెద్ద లున్నారు; పెద్దమనుషులున్నారు; అధికారులున్నారు; అనధి కారులున్నారు; స్టూడెంట్లున్నారు; గుమాస్తాలున్నారు; వ్యాపారస్తులున్నారు - ఇంకా చాలామంది వున్నారు.

రాజిగాడు వాళ్ళెవరికోవకీ చెందినవాడు కాదు. రిక్షా లాక్కుని బ్రతికే సామాన్యుడు. లేదా-రిక్షాలాక్కుని కూడా బ్రతకలేక పోతున్న. చావనూ లేక పోతున్న దౌర్భాగ్యుడు.

అందుకే రాజిగాడు అందరికీ ఎడంగా — ఒకమూల నక్కి నుంచున్నాడు.

అందరిలాగే వర్షంలోకి చూస్తున్నాడు.

వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని చూస్తున్నాడు.

అయితే వర్షం పూర్తిగా తగ్గాలని లేదు రాజిగాడికి.

పూర్తిగా తగ్గకుండా కొంచెం కొంచెం పడుతూ వుంటేనే తనకి మంచి బేరాలొస్తాయి

నడిచి వెళ్తే తడిసిపోయేంత ఎక్కువగానూ, రిక్షాలో వెళ్తే తడవనంత తక్కువగానూ పడాలి వర్షం.

అలాపడితే రాజిగాడికి నాలుగు బేరాలు దొరుకుతాయి.

కాని - ఇప్పుడు రిక్షాలో వెళ్ళినా కూడా ముద్ద ముద్దగా తడిసిపోయేంత ఎక్కువగా పడ్తోంది వర్షం. అంత వర్షంలో ఏ టాక్సీలోనో తప్ప రిక్షాలో ఎవరూ ఎక్కరు. వర్షం తగ్గేదాకా ఎక్కడో ఆగి, అప్పుడు కాని రోడ్డు మీదికి రారు.

ఇదంతా ఆలోచిస్తూ,- సీ, యెదవ్వాన- అనివర్షాన్ని తిట్టుకున్నాడు రాజిగాడు,

తిట్టినా వర్షం తగ్గలేదు.

గుంపులో నిలబడ్డ ఒక పెద్దమనిషి - రాజిగాడుతనకి మరీ దగ్గరగా నిలబడ్డాడని - ఏరా వాళ్ళు పొగరా, కళ్ళు కనబడ్డం లేదా, దూరంగా నిలబడు" - అని రాజిగాణ్ని తిట్టాడు.

ఆ తర్వాత కాస్సేపాగి - 'ఛీ, వెధవ వర్షం' — అని వర్షాన్ని తిట్టాడు.

పెద్దమనిషి తిట్టినా కూడా వర్షం తగ్గలేదు.

ఎడతెరిపి లేకుండా కురుస్తూనే వుంది.

అప్పుడే లోపల పూరీలు, ఆపైన రవ్వదోసె తిని, కాఫీ తాగి బయటికొచ్చిన కాలేజీ కుర్రాడు - వక్కపొడి వేసుకొని సిగరెట్ వెలిగించి, రోడ్డు మీదికి చూస్తూ - 'హెల్ విత్ ద రెయిన్' - అని ఇంగ్లీషులో వర్షాన్ని తిట్టాడు.

కాలేజీ కుర్రాడు ఇంగ్లీషులో తిట్టినా కూడా వర్షం తగ్గలేదు. కురుస్తూనే వుంది.

మరికాస్త పెరిగింది కూడాను.

అయితే వర్షాన్ని ఇంగ్లీషులో తిట్టిన కాలేజీకుర్రాడు ఆ వెంటనే నాలిక్కరుచు కున్నాడు.

వర్షంలో సగం తడసి అక్కడికొచ్చి ఓ పక్కన నిల బడ్డ అమ్మాయి సగం తడిసిన చీరలో చాలా అందంగా

కనబడిందా కుర్రాడికి ఈ వర్షమే రాకపోతే ఇంత 'బ్యూటిఫుల్ గాల్'ని, యింత సేపిలా హాయిగా చూడ్డానికి వీలయ్యేదా అని తనకి తానే ప్రశ్నించుకుని, వీలయ్యేది కాదని తనకి తానే సమాధానం చెప్పుకుని, వర్షాన్ని ఇంగ్లీషులో మెచ్చుకుని, ఆ అమ్మాయివంక రెప్ప వేయకుండా చూస్తూ నిలబడ్డాడు.

ఎడతెరిపి లేకుండా కుంభ వృష్టిగా కురుస్తున్న ఆ వర్షాన్ని ఆ కాలేజీ కుర్రాడిలాగే, మెచ్చుకుంటున్న వాళ్ళింకా మరికొంత మంది లేకపోలేదు.

వర్షమిలాగే కురుస్తూవుంటే, తలదాచుకోడానికొచ్చిన వాళ్ళంతా తలో కప్పు కాఫీఅయినా తాగకపోతారా అన్న ఆనందంతో హోటల్ అయ్యరు తన కుర్చీలోంచి లేవకుండానే బయటికి చూస్తూ వర్షాన్ని మెచ్చుకున్నాడు.

వర్షం యివ్వాల్టిలాగే యింకో నాల్రోజులు పడితే తన పంట పండుతుందని రెయిన్ కోట్లూ గొడుగులూ అమ్మే వ్యాపారి వర్షాన్ని మరీ మరీ మెచ్చుకున్నాడు.

పని అసల్లేకుండా, డబ్బు చాలావున్న ఒక ధనవంతుడు - తన యింటి మూడో అంతస్తులో పట్టె మంచమ్మీద పేటవాలుగా పడుకుని, ఆ వానలో వెచ్చగా వుండే పానీయం సేవిస్తూ - వర్షాన్ని చాలా బాగా మెచ్చుకున్నాడు.

కొత్త పెళ్ళాం కౌగిట్లో లోకాన్ని మర్చిపోయిన ఒక యువకోద్యోగికి - ఉద్యోగం కంటే పెళ్ళాం కౌగిలే బావుందనిపించి, ఈ వర్షంలో ఇంకా బావుంటూందనిపించివర్షాన్ని అపరిమితంగా మెచ్చుకున్నాడు.

తనని మెచ్చుకునే వాళ్ళు కూడా యింతమంది వున్నారు గదా అనుకుని వర్షం తనకి తానే మురిసిపోయి మరింత జోరుగా కురవడం ప్రారంభించింది.

వర్షం పెరిగిన కొద్దీ రాజిగాడి మనసులో దిగులు పెరిగింది.

వర్షం తగ్గితే తప్ప వాడికి బేరం దొరకదు.
బేరం దొరికితే తప్ప తన పొట్టనిండదు.
ఇంట్లో వాళ్ళ పొట్టలు నిండవు
పొద్దుట్నించీ అసలు బేరం దొరక లేదు.
నిన్న కూడా అంతంత మాత్రమే.
నిన్న అర్థాకలితో గడిపాడు
ఇవ్వాళింత వరకూ అసలు ఏమీ తినలేదు.
అప్పుడే పొద్దు చాలా గడిచింది. గడిచి పోతుంది.
వర్షంతగ్గలేదు. తగ్గేట్టు లేదు.
రాజిగాడికి ఆకలిగావుంది. చిరాగ్గావుంది.
కోపంగా వుంది.
వర్షం తగ్గలేదు.

అక్కడికి రెండు మైళ్ళ దూరాన - అంత వర్షానికి నిలుస్తుందా అన్నట్టుగా వున్న ఒక గుడిసెలో - అసలీమె లేచి నిలబడుతుందా అన్నట్టుగా వున్న రాజిగాడి ముసలి

తల్లి —గుడిసె గుమ్మంలో కూలబడి, బయటికి, ఎడతెగని వర్షంలోకి - దిగులు దిగులుగా చూస్తోంది.

ఆమె పక్కనే ఎముకల పోగుల్లా కూర్చుని వున్న యిద్దరు పిల్లలు - రాజిగాడి తమ్ముళ్ళు - అప్పుడప్పుడే ముసురు కుంటున్న మసక చీకట్లోకి, ఆగకుండా కురుస్తున్న వర్షంలోకి అలాగే దిగులు దిగులుగా, అన్న వస్తాడేమో, తినడానికేమైనా తెస్తాడేమో నని ఆశ ఆశగా చూస్తు న్నారు.

హోటల్ వరండాలో రాజిగాడింకా అలాగే నిలబడి వున్నాడు.

రాజిగాడికి ఆకలేస్తోంది.

రాజిగాడి ముసలి తల్లికి ఆకలేస్తోంది.

రాజిగాడి తమ్ముళ్ళకి - వొంట్లో ఎముకలు తప్ప యింకేమీ లేనివాళ్ళకి - కూడా ఆకలేస్తోంది.

అయినా వర్షం తగ్గలేదు.

ఆ వేళంతా తగ్గలేదు.

రాజిగాడికి బేరం దొరకలేదు.

వాడికీ, వాడి తల్లికీ, వాడి తమ్ముళ్ళకీ ఆ వేళ తిండి దొరకలేదు.

---